# ప్రణయరాగం

ఏదో అద్భుత ప్రపంచంలో ఉన్నట్టుగా ఉంది విరాజితకు! 'తనెప్పుడైనా కలగనిందా పెళ్ళయ్యాక హనీమూన్‌కి 'శాన్‌ఫ్రాన్సిస్‌కో'కు వస్తుందని... ఎక్కడ కడప ఎక్కడ కాలిఫోర్నియా!

'గాలంట్' రోడ్డుమీద స్మూత్‌గా జారిపోతుంటే కళ్ళు విప్పార్చుకుని చుట్టూ ఉన్న అందమైన దృశ్యాలలో ఏ ఒక్కటీ మిస్ కాకూడదన్నట్టు చూస్తోంది.

కారులో సి.డి. ప్లేయర్‌లో నుండి 'అగర్ తుమ్ న మిలేతో...' పాటవస్తోంది. విజిల్‌వేస్తూ కారు నడుపుతున్న రోహిత్ విరాజితను దగ్గరకు లాక్కుని బుగ్గమీద ముద్దు పెడుతూ 'ఐ యామ్ సో హేపీ'' అన్నాడు.

"ఇలా అయితే నేను వెనుకసీట్లో కూర్చుంటాను" సిగ్గుల మొగ్గయిన విరాజిత బెదిరించింది.

"ఓయ్... నేను డ్రైవర్నికాదు బాబూ తమకు... ఇంత దూరం డ్రైవ్ చేయాలంటే శక్తికోసమని దార్లో చాక్లెట్స్ తినిపించకపోతే ఎలా?" అన్నాడు రోహిత్.

హేవర్డ్, ఓక్‌లాండ్‌లాంటి ప్రదేశాలుదాటి శాన్‌ఫ్రాన్సిస్‌కోకు చేరేసరికి పదకొండు గంటలైంది.

లెవెల్ ఫైవ్‌లో పార్కింగ్ దొరికింది. గంటకు ఆరు డాలర్లు ఫీజు. పియర్ థర్టీనైన్ క్రూయిజ్ ట్రిప్ కోసం క్యూలో నిలబడ్డారు విరాజిత, రోహిత్. వీళ్ళవంతు వచ్చి టికట్ దొరికేసరికి అరగంట పట్టింది.

"వై డోంట్ వి హేవ్ బీర్... మజా వస్తుంది తెల్సా?" పద్దెనిమిదిడాలర్లు ఒక్కొక్కటికెట్‌కి కట్టి టికెట్లు తీసుకుని క్యూనుండి బైటపడిన రోహిత్ అడిగాడు.

విరాజిత షాక్ తిన్నట్టుచూసింది అతని వైపు. వాళ్ళిద్దరి పెళ్ళై ఇంకా నెలరోజులు కాలేదు. భర్త దగ్గర చనువు లేదు. ఇంకా కొత్తగా ఉంది విరాజితకు. 'అతను తాగుతాడా? అన్న ఆలోచన రాగానే కాటుకదిద్దిన ఆమె విశాల నయనాల్లో నీళ్ళు నిండాయి.

"అరె.. బాబోయ్, సరదాకు అన్నాను రాజీ. ప్రామిస్... నాకు డ్రింక్స్ అలవాటు లేదు.. జస్ట్ నిన్ను టీజ్ చేయాలని..." విరాజిత భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కుంటూ అన్నాడు రోహిత్.

"ఏయ్... ఏమిటిది... అందరూ చూస్తుండగా..." అని అతని నుండి దూరంగా జరిగింది.

"దిసీస్ అమెరికా మేమ్‌సాహిబ్... అటుచూడు" అంటూ వాళ్ళవైపుగా వస్తున్న ఒక జంటను చూపించాడు రోహిత్. చిన్న షార్ట్స్, పైన బ్రాలాటి బనియన్ వేసుకున్న అమెరికన్ పిల్ల తన ప్రేమికుడి కాళ్ళమీద కాళ్ళు పెట్టి నిలబడి రెండుచేతుల్తో అతని ముఖం పట్టుకుని అతని పెదవులను గాఢంగా చుంబిస్తోంది. ఆ అబ్బాయి చేతులు ఆ పిల్ల హిప్స్‌మీద వేసి హత్తుకుంటున్నాడు. విరాజిత ముఖం ఎఱ్ఱగా కందింది.

"హే... వాళ్ళు రొమాంటిక్ మూడ్‌లో ఉంటే నువ్వు అంతలా సిగ్గుపడితే ఎలా?" రోహిత్ పకపకా నవ్వుతూ విరాజిత చేయిపట్టుకుని ఎదురుగా ఉన్న నెప్ట్యూన్ రెస్టారెంట్‌కి లాక్కుపోయాడు. ఇద్దరికీ కాఫీ లాటెకు ఆర్డర్ ఇచ్చాడు. కాఫీ అని అడిగితే ఉత్త డికాక్షన్ ఇస్తారనీ, కాఫీ లాటె అని అడిగితే పాలు కలిపిన కాఫీ ఇస్తారనీ విరాజితకు వివరించాడు. తనే వెళ్ళి రెండు మగ్స్‌లో కాఫీ, సుగర్ పేకెట్స్, కలపడానికి 'స్ట్రా'లు తీసుకొచ్చాడు రోహిత్. వాళ్ళు బయటకు వచ్చేసరికి వాళ్ళు ఎక్కాల్సిన 'ఓల్డ్ బ్లూ' పడవ కదలడానికి సిద్ధంగా వుంది.

'పద...' అంటూ విరాజిత నడుము చుట్టూ చేయివేసి ముందుకు నడిపించాడు రోహిత్.

పాలమీగడలో గులాబి రేకులు కలిపిన ఛాయలో ఉన్న విరాజిత ఆకుపచ్చరంగు చుడీదార్‌లో చాలా అందంగా కనబడుతోంది. పల్చని టాప్‌లో నుండి కనబడుతున్న నడుము వంపు అతన్ని కవ్విస్తోంది... ఆమె నడుమును చుట్టిన అతని చేయి అక్కడి నుండి పైకి కదులుతుండడంతో 'నోట్రిక్స్' అంటూ అతని చేయి విడిపించుకుని ముందుకెళ్ళింది విరాజిత. పడవలో కింద సీట్స్ అన్నీ నిండిపోవడంతో డెక్ మీదకి పరిగెత్తారు వారు.

తన ముందు సీట్లలో కూర్చున్న ఇందాకటి అమెరికన్ యువతీ యువకులను చూసి విరాజితవైపు అర్థవంతంగా చూసి భుజాలెగురవేసాడు రోహిత్.

పడవ స్టార్ట్ అయి వేగం అందుకోగానే చలిగాలికి వణుకొచ్చేసింది విరాజితకు. ముందు కూర్చున్న జంట తుళ్ళుతూ కేరింతలు కొడుతూంది. మధ్యలో ముద్దులు పెట్టుకుంటున్నారు.

ఆ అబ్బాయి చేతులు ఆమె ఒంటి ఒంపులను ఆత్రంగా తడుముతున్నాయి. వాళ్ళను చూస్తుంటే విరాజితకు ఏమిటోలా ఉంది.

"చలిగా ఉందా?" అంటూ రోహిత్ తనకు దగ్గరగా జరిగితే "ఏం లేదు.." అంటూ సర్దుకుని కూర్చుంది. పడవ గోల్డెన్ గేట్ బ్రిడ్జ్‌ను సమీపిస్తుండగానే ప్రయాణీకులలో ఉత్సాహం తొంగిచూసింది. కొందరు డెక్ ముందుకెళ్ళి గోల్డెన్ గేట్ బ్రిడ్జ్‌ను బాక్‌గ్రవుండ్‌గా కనబడేట్టు ఫోటోలు తీసుకున్నారు. పేరుకు 'గోల్డన్ గేట్ బ్రిడ్జ్' ఐనా బంగారు రంగులో కాక ఎరుపురంగులో ఉన్న ఆ అద్భుతాన్ని చూస్తూ పరవశిస్తోంది విరాజిత.

బ్రిడ్జి కిందనుండి తిరిగి వచ్చేటప్పుడు సముద్రం మధ్యలో ఉన్న కొండమీద కనబడే కట్టడం గురించి గైడు వివరిస్తున్నాడు. యుద్ధఖైదీల్ని అక్కడ బంధించేవారనీ... తప్పించుకోవాలని ప్రయత్నించిన కొందరు నీటమునిగి ప్రాణాలు పోగొట్టుకున్నారనీ వివరించాడు.

పడవ తిరిగి గట్టుకు వచ్చేదాకా వీళ్ళముందు సీటులోని జంట అతుక్కుపోయి వాళ్ళలోకంలో వాళ్లున్నారు. పడవదిగి వచ్చాక ఇరవై అడుగుల పొడవుండి. కళ్ళు చెదిరేట్టు దీపాల అలంకరణలో ఉన్న క్రిస్మస్ ట్రీ దగ్గర విరాజిత రోహిత్ ఫోటోలు తీసుకున్నారు.

"ఆర్‌యు హ్యాపీ?" అడిగాడు రోహిత్.

"అయామ్ వెరివెరీ హ్యాపీ..." చెప్పింది విరాజిత.

"ఓంట్ యు అలవ్ మి టు కిస్ యు?" విరాజిత ముఖాన్ని చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు.

'రోహిత్... డోంట్ ఫర్‌గెట్ విఆర్ ఫ్రమ్ ఇండియా' అతడి నుండి జరుగుతూ అందామె.

"ఓ.కె. సారీ..." చాలా డిస్సప్పాయింట్ అయినట్టు ముఖం పెట్టి ముందుకు నడిచాడు రోహిత్. చైనాటౌన్‌లో కాసేపు తిరిగి, ఆరు డాలర్లు పెట్టి ఒక పగడాలదండ కొనుక్కుని తిరుగు ప్రయాణమయ్యారు వారు.

దారిలో రోహిత్ మౌనంగా ఉన్నాడు. అతనికి కోపం వచ్చింది ఏమో అని మధనపడుతూ తాను నిశ్శబ్దంగా కూర్చుంది విరాజిత. 'ఫ్రీమాంట్'లోని వాళ్ళ ఇంటికి చేరడానికి గంటన్నర దాకా పట్టింది. కారు పార్క్‌చేసి ఎలివేటర్‌లో సెకండ్ ఫ్లోర్‌లోని వాళ్ల అపార్ట్‌మెంటుకు వచ్చేదాకా ఇద్దరూ అలాగే ఉన్నారు.

తలుపుతీసి లోనికి రాగానే అతన్ని అల్లుకుపోయింది విరాజిత "ఐయామ్ సారీ రోహిత్" అంటూ. ఆమె నడుము పట్టి పైకెత్తి మెడమీద వెచ్చని ముద్దులు కురిపిస్తూ 'మనిద్దరి మధ్యన 'సారీ'కి చోటుఉండకూడదు తెలుసా?" అంటూ ఆమె గుండెల్లో తల దాచుకున్నాడు రోహిత్.

"సరే...నెక్ట్స సన్‌డే ఎక్కడికి వెళ్తున్నాం?" గోముగా అడిగింది విరాజిత.

"చెప్పనుగా.. సస్పెన్స్...

"డన్.." అంది విరాజిత రేగిపోయిన అతని జుత్తుని పల్చని తన వేళ్ళతో మెత్తగా దువ్వుతూ.

మూడు నెలలు గడిచాయి. ఈసారి 'డిస్నీలాండ్'కి వెళ్లాలని తయారయ్యారు విరాజిత, రోహిత్, 'లాస్‌ఏంజిలస్'లో హోటల్ 'రమడా'లో గది రిజర్వ్ చేసుకున్నారు. ఫ్రీమాంట్ నుండి ఒంటిగంటకు బయల్దేరి రాత్రి ఎనిమిదింటికి లాస్ ఏంజిలస్' చేరారు. గదిలో సామానుపెట్టేసి, ఫ్రెషప్ అయి భోజనానికి ఇండియన్ రెస్టారెంట్ కోసం బయటపడ్డారు.

'ఇండియన్ సమ్మర్' అనే హోటల్లో భోజనం ముగించి రూమ్‌కెళ్ళి పడుకున్నారు. ప్రొద్దున్నే 'ఆనా హైనా' అనే చోట ఉన్న డిస్నీలాండుకు బయల్దేరారు.

పినోచియా పార్కింగ్ ప్లేస్‌లో ఏడుడాలర్లు కట్టికారు పార్కుచేసి ఫ్రీ ట్రామ్‌లో ఎక్కి లోపలికి వెళ్ళి టికెట్స్ కోసం క్యూలో నిలబడ్డారు. లోపలికి అడుగుపెట్టగానే "డిస్నీలాండ్... ది హేపీయెస్ట్ ప్లేస్ ఇన్ ది వరల్డ్' అని లైట్లతో మెరుస్తున్న బోర్డు కనబడింది.

ఒక్కో టికెట్టు నలభైమూడు డాలర్లు పెట్టి కొనుక్కుని లోపలికి ప్రవేశించారు అక్కడంతా ఒకపెద్ద జాతరలా ఉంది. పిల్లలు, పెద్దలు తలకు రకరకాల టోపీలు, ఈకలు పెట్టుకుని తిరుగుతున్నారు.

విరాజిత రోహిత్ చిన్నపిల్లల్లా ఆ గుంపులో కలిసిపోయారు ఆనందంగా కేరింతలు కొడుతూ.

'టుమారో లాండ్' చూసేసి 'టూన్ టవున్'లోకి వెళ్ళి 'చిప్ & డేల్' కార్టూన్ కారెక్టర్స్ ఇళ్ళదగ్గర ఫొటోలు తీసుకున్నారు. అక్కడంతా తిరిగితిరిగి అలసిపోయాక 'ప్లాజా గార్డెన్స్'లో లంచ్ చేసి థియేటర్‌లో 'హనీ ఐ ష్రంక్ ది ఆడియన్స్' అనే 'త్రిడి' సినిమా చూసారు.

కళ్ళకద్దాలు (వాళ్ళే సప్లైచేసినవి) పెట్టుకుని సినిమా చూస్తుంటే అందులో మనుషులు జంతువులు అన్నీ బ్రహ్మాండమైన సైజులో కనబడుతుంటే భయంగానూ థ్రిల్లింగ్‌గానూ అనిపించి రోహిత్ చేయి గట్టిగా పట్టుకుని కూర్చుంది విరాజిత. పులితలతో ఉన్న పాముమీదకి రాగా, అరిచింది. థియేటర్ నుండి వచ్చాక ఫెయిరీ లాండ్‌లో కార్టూన్ కారెక్టర్స్ షో ఒకటి చూశారు. స్టేజిపక్కగా ఒక స్త్రీ ఆ 'షో'లో ఏం జరుగుతున్నదో సైగల్తో మూగవాళ్ళ కోసం చెప్తోంది. 'నిజంగా అమెరికాలో ప్రతివాళ్ళ గురించీ శ్రద్ధ తీసుకుంటారు కదా రోహిత్' అంది విరాజిత బయటకు వచ్చాక. "చూశావుగా, ఫిజికల్లీ చాలెంజ్‌డ్' వాళ్ళకోసం మాల్స్‌కి దగ్గర్లో పార్కింగ్ ప్లేస్, బస్సుల్లో,

ఫ్రంట్ పోర్షను అంతా వీల్‌ఛెయిర్ వాళ్ళకోసం ఉంచడం, రెస్ట్ రూమ్స్‌లోకూడా వీల్‌ఛెయిర్ వాళ్ళకోసం స్పెషల్ టాయ్‌లెట్స్ వుంచడం... అంతెందుకు రేప్పొద్దున్న నువ్వు ప్రెగ్నెంటు అయ్యావనుకో... నీకు స్పెషల్ పార్కింగ్ ప్లేస్ కూడా ఉంటుంది. అన్నాడు రోహిత్.

"ఏయ్.." అంటూ రోహిత్ చేయి గిల్లిందామె అంతలో సడెన్‌గా "రోహిత్...అటు చూడు" అంది.

"శాన్‌ఫ్రాన్సిస్‌కో'లో పియర్ 39లో వీళ్ళ పడవలో వచ్చిన అమ్మాయి పక్కనుండి వెళ్తూ కనబడింది.

"ఆ అమ్మాయే కదూ..." అన్నాడు రోహిత్.

"సందేహం లేనే లేదు ఆ అమ్మాయే... కానీ పక్కన అబ్బాయే మారిపోయాడు" అంది విరాజిత.

నిజమే ఈసారి ఆ అమ్మాయితో ఉన్న అబ్బాయి రష్యన్‌లా కనబడుతున్నాడు. ఒకరి నడుముచుట్టూ మరొకరి చేయి పట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ ముందుకు వెళ్ళారు వారు. సడెన్‌గా మధ్యలో ఆగి గాఢంగా ముద్దుపెట్టుకున్నారు. ఆ అమ్మాయిని ఇంచుమించు ఎత్తుకుని తీసికెళ్ళినట్టుగా వెళ్తున్నాడా కుఱ్ఱాడు.

"వాళ్ళనేం చూస్తావు డిస్నీ పెరేడ్‌కి టైమవుతూంది. మళ్ళీ మనకు చోటుదొరకదు కూర్చోడానికి" అంటూ పెరేడ్ వచ్చేవైపు కదిలాడు రోహిత్.

అప్పటికే దారికటువైపు ఇటువైపు మనుషులతో నిండిపోయింది. ఎలాగో చోటుచూసుకుని ఇద్దరూ కూర్చున్నారు. పాటలు, డాన్సులు జరుగుతుండగా ఒక దానివెంట ఒకటి 'థీమ్' ప్రకారం అలంకరించిన వెహికల్స్ రావడం మొదలవ్వడంతో సర్వం మర్చిపోయి ఆ అద్భుత ప్రపంచంలో భాగమయ్యారా దంపతులు.

"ఎలా వుంది?" విరాజిత నడిగాడు రోహిత్.

వండర్‌పుల్... "కళ్ళు మెరుస్తుండగా అంది. "శాంటాక్లాస్ టాయ్‌షాప్', బ్యూటీ అండ్ ది బీస్ట్' 'మెర్ మెయిడ్' బావున్నాయి" అంది మళ్ళీ.

"నీ కళ్ళలో సంతోషంచూస్తుంటే నిన్ను ముద్దుపెట్టుకోవాలని అనిపిస్తోంది తెల్సా?" ప్రేమ, కోరికనిండిన కళ్ళతో ఆమెను చూస్తూ అన్నాడు రోహిత్.

"అవన్నీ మనిద్దరమే ఉన్నప్పుడు సార్" అంటూ చకచకా ముందుకు పరిగెత్తింది విరాజిత.

'స్మాల్ వరల్డ్' షోలో పడవలోవెళ్తూ అటు ఇటు గట్టుమీద ఉన్న వందలాది బొమ్మలు కదులుతూ, ఆడుతూ వాయిద్యాలు పలికిస్తూ ఉంటే ఎటు చూడాలో తెలియని ఆనందోత్సాహాలతో చూశారు వారిరువురూ.

"హే... మన తాజ్‌మహల్... పాములవాడి బొమ్మ.. వున్నాయి చూడు" అని అరిచింది విరాజిత. తొమ్మిదిన్నరకు 'ఫైర్‌వర్క్స్' షో మొదలైంది. రకరకాల బాణాసంచా ఆకాశంలో అందాలను వర్షిస్తుంటే చూస్తూ తమ ఇంట్లో దీపావళి గురించి తలచుకున్నారు.

"డిస్నీలాండ్ నచ్చింది కదూ?" కారు డ్రైవ్ చేస్తున్న రోహిత్ అడిగాడు తిరుగు ప్రయాణంలో.

"చాలా చాలా బాగుంది" సంబరంగా అంది.

"ఈ శనివారం మా పిన్ని బాబాయ్‌ల ముప్ఫై ఒకటో వెడ్డింగ్‌డే మనం వెళ్లాలిరా..." అన్నాడు రోహిత్ ఇంటికి చేరాక.

"కొత్త చీరె, పంచెలచాపు రెడిగా ఉందిగా..." అని 'రోహిత్' అంటూ ఆగిపోయింది విరాజిత.

ఆమె కళ్లలో మెరుస్తున్న కన్నీటి తడి చూసి చలించిపోయాడు రోహిత్. "ఏమిటి చిన్నా... ఏమైంది?" అడిగాడు ఆమెను పొదిని పట్టుకుంటూ.

"మన ప్రేమ, ప్రణయం మనిద్దరికే పరిమితమైన లోకం కదూ! మనం కూడా మీ పిన్నీ బాబాయిలలా ముప్ఫై ఆరో నలభై ఐదో పెళ్ళి రోజులు జరుపుకోవాలి. ఊపిరి ఉన్నంతవరకు కలిసి ఉండాలి... మన ప్రేమ ఆపుకోలేని తమకంగా పైకి పొంగిపార్లి నలుగురికళ్ళకు కనబడనక్కర్లేదు గానీ మనిద్దరి మధ్య ఇలాగే జీవితాంతం ఉండాలి..." అంది విరాజిత.

రోహిత్‌కి ఆమె మనసు అర్థమైంది. భార్యను దగ్గరికి హత్తుకుని ప్రేమగా చుంబించాడు.

'స్వాతి' సచిత్ర వార పత్రిక

తేది : 19-12-2003